# కారా మాస్టారితో కేతు...

*ఈ ప్రత్యేక ఇంటర్వ్యూ 1995 మార్చి 19, 20 తేదీలలో ప్రసారితం కాబడింది.*

కాళీపట్నం రామారావుగారు తెలుగు జాతి గర్వించదగ్గ కథా రచయిత. ఆధునిక భారతీయ సాహిత్య నిర్మాతలలో చేరదగిన సాహిత్యకారుడు ఆయన.

కారాగా, మాస్టారుగా, కథల మాస్టారుగా, దేముడు మాస్టారుగా తెలుగు సాహిత్యలోకంలో కాళీపట్నం రామారావుగారు ప్రసిద్ధులు. కథా రచయితలకు "దీపధరుడు" – ఆయన.

'నేటి కథ' ద్వారా, 'కథా కథనం' ద్వారా ఎందరో కథకులకు కథా రచనలోని జీవలక్షణాలు నేర్పించిన మాస్టారు ఆయన.

ఒక్క 'యజ్ఞం' మీద, మరొక్క 'భయం' మీద, మరొక్క 'చావు'మీద, మరొక్క 'ఆర్తి' మీద వచ్చిన విమర్శలు, పరిశోధనలు బహుశా ఏ కథా రచయిత కథల మీద కూడా రాలేదేమో – రాశిలో వాసిలో కూడా.

ఈ రోజు కాళీపట్నం మాస్టారు తమ 52 ఏళ్ళ కథా రచన అనుభవాలను ఆకాశవాణి శ్రోతలతో పంచుకుంటున్నారు.

కేతు : మాస్టారూ! మీకూ అసలు కథలు రాయాలన్న ప్రేరణ ఎప్పుడు కలిగింది? ఎందుకు కలిగింది?

కారా : 1935 ఆ ప్రాంతంలో నేను శ్రీకాకుళం హైస్కూల్లో చేరేను. 36, 37, 38 ప్రాంతాలలో – ఈ ప్రేరణ ఎప్పుడు జరిగిందనేది స్పష్టంగా చెప్పలేను, కానీ – ఆ దశలోనే జరిగింది. అది నా విద్యార్థి దశ. ఈ ప్రేరణ ఏమిటి? అన్న దానికి – రెండు మూడింట్లో ఏదో – నేను స్పష్టంగా చెప్పలేను. ఒకటి – మా ఇంట్లో, మా నాన్నగారు వస్తున్నటువంటి ఆధునిక సాహిత్యాన్ని ఆనాటి సాహిత్యాన్ని చదివేవారు. నాకు ... మా ఊర్లో ఒక లైబ్రరీ ఉంది – శ్రీ రామకృష్ణ గ్రంథాలయం అని – దానిలో ఆంధ్రపత్రిక, కృష్ణాపత్రిక, భారతి, ఆంధ్రపత్రిక ఉగాది సంచికలూ – తరువాత అప్పట్లో వెలువడుతున్న నవలలూ మొదలైనవన్నీ లభ్యమయ్యేవి. మా నాన్నగారు బాగా చదువుతుండేవారు. మా అమ్మగారు కూడ... కాశీ మజిలీ కథలు చదువుతుండేవారు. ఇరుగుపొరుగుల్తో చేరినప్పుడు వారి మధ్య ఈ పుస్తకాలు చదవడం ఒక జ్ఞాపకం ఉంది. స్త్రీల పాటలకు సంబంధించి పాడడం జ్ఞాపకం ఉంది. వీటి అన్నింటి ప్రభావం వల్ల నాలో దీని బీజాలు పడుండొచ్చు. అయితే, రాయాలని కోరిక కలగడానికి – శ్రీకాకుళంలో నేను ఒక ఇంట్లో ఉండేవాడిని. వాసుదేవరావుగారని – వారి ఇంటి పేరు ... ఆయన దగ్గరకి మల్లాది వెంకటకృష్ణమూర్తిగారని – విశ్వనాథ కవిరాజుగారి సోదరులు – ఆయన వచ్చి అప్పటి సాహిత్యానికి సంబంధించి నాటకాలు, కథలు కూడా కొన్ని చదివిన గుర్తు. ఆ భాషా, అవీ చూస్తే పెద్ద పాండిత్యం లేకపోయినా సరే రాయొచ్చు అనేటటువంటి అభిప్రాయం కలిగింది. అలాగే బలిజేటి (?) బాలకృష్ణశర్మ అనుకుంటాను – అతను మాకు సీనియర్, స్కూల్లో – అతని కథలు, అప్పుడే పడుతున్నట్లు, 'కథాంజలి' అని ఒక పత్రికలో పడగా ఎరుగుదును. దాని ప్రభావం కావొచ్చు. ఆ తరువాత రోజుల్లో ఒక ఏడాది పాటు ఇంటి

దగ్గర వుండిపోయాను. సిక్కి ఆ ఏడాది విశ్రాంతి కావాలంటే ఆ ఏడాది కాలంలో మా గ్రంధాలయంలో వుండేటటువంటి వచన సాహిత్యానికి సంబంధించినవి దాదాపు పూర్తి చేశాను. వీటన్నిటి ప్రేరణతో రాయాలన్నటువంటి కోరిక కలిగింది.

కేతు : ఇది సాహిత్య ప్రేరణతో .... జీవితంలోనుంచి మీకు అప్పుడు ఏమైనా ప్రేరణలు లభించాయా – మీకు – కథలు రాయడానికి.

కారా : జీవితంలోనుంచి ... అంటే ... ఒకప్పుడు జీవితం అర్థంకాక, కన్ఫ్యూజై, ఇల్లు వదలి బయటకు వెళ్ళిపోవాలనేటువంటి ప్రయత్నం కూడా చేశాను. ఆ రోజుల్లో నేనేమనుకున్నానంటే నా అభిప్రాయాలు పంచుకోవడానికి, చెప్పడానికి ప్రయత్నంచేసే మాటైతే నాకు ఇంతో అంతో పేరుంటే తప్ప నా అభిప్రాయాలు ఎవరూ తీసుకోరేమో అనుకున్నాను. అవి ... వేటికి సంబంధించినవో నాకు సరిగా జ్ఞాపకం లేవు – ఆ విషయాలు నేను తక్కినవారితో పంచుకోవలసిన విషయాలు. అందుచేత ముందు కథలు వ్రాసి ఒకపేరు సంపాదించి ఆ తరువాత నేను ఏవైనా చెప్పగలిగినవి వుంటే చెప్పవచ్చు అనుకున్నాను. ఆ విధంగా రచనకి 1943లో ప్రారంభించేను. అంతకు ముందే కొన్ని రాసినా అవేవీ పత్రికల్లో అచ్చవలేదు.

కేతు : మీ మొట్టమొదటి కథ ఎప్పుడచ్చయింది? ..... '43లో అన్నారు. ఆ కథ పేరు?

కారా : నా 'ఫ్లాట్ ఫారమో?'

కేతు : 'ఫ్లాట్ ఫారమో?' ..... ఇటీవల 'రచన'లో దాన్ని పునర్ముద్రించేరు.

కారా : ................

కేతు : మరి మీరు రాసినటువంటి కథల్లో ... మొదట కార్డు కథతో దాదాపు ప్రారంభించినట్లూ తెలుస్తోంది. తరువాత వ్రాసిన కథల్లో చాలావరకు పరిమాణంలో చాలా పెద్దవి. ఇదీ – ఈ వైరుధ్యాన్ని మీరు ఎట్లా సమన్వయం చేసుకున్నారు? అంటే ... కార్డు కథలతో మొదలుపెట్టి చాలా పెద్ద కథలు రాసేటటువంటి పరిస్థితి.

కారా : పెద్ద కథలు రాయటానికి ... నాకు సరిగ్గా చేతకాని దశ. నేను పుట్టి పెరిగింది చాలా చిన్న పల్లెటూరు. పట్నాల్లోని, ఉత్తమ సాహిత్యంతోని, నాకు పరిచయం మా ఊరి గ్రంథాలయంలో జరగలేదు. నేను విశాఖపట్నం వచ్చింతరువాత హిందూ రీడింగ్ రూమ్‌లో ఉత్తమ సాహిత్యంతోటి మొదటి పరిచయం నాకు ఏర్పడింది. ఈ ఏర్పడ్డ దశల్లో వాళ్ళు రాస్తున్నదేమిటో నేను చూస్తున్నాను. నేను ... ఆ దశకి రాయగలిగేటటువంటి శక్తి నాకు లేదని నాకు అర్థమైంది. అందుచేత .... ఆనాడు వస్తుండేటటువంటి చిత్రగుప్త, రూపవాణి, ఆనందవాణి ఇట్లాంటి వాట్లో ఉండేటటువంటి చిన్నసైజు రచనల్తో ప్రారంభించడమే ఉత్తమం అనుకున్నాను. అందుకోసమని చెప్పి అవి రాశాను. తరువాత అలాంటివి ఒక డజను, లేకపోతే కాస్తా అటూ, ఇటూగా రాసిన తరువాత ఆంధ్రపత్రిక్కి సరిపడ కథలు రాయాలన్నటువంటి ప్రయత్నం చేసేను. అవొక నాలుగైదు అయిన తరువాత 'భారతి'లో రాసాను. అయితే ... రాయగలిగేటటువంటి సామర్థ్యం పెరిగిన కొద్దీ, చెప్పాలనేటటువంటి కోరిక ఎక్కువైంది.

కేతు : అంటే చెప్పాలనేటటువంటి కోరిక ఎక్కువయ్యిందా? జీవితాన్ని విస్తృతంగా చూడ్డం

కన్నా ఆ జీవితంలో ఉండేటటువంటి కొంత సంక్లిష్టతత అర్థం కావడం వల్ల తప్పనిసరిగా అంత సంక్లిష్టమైనటువంటి జీవితాన్ని చిత్రించడానికి పెద్ద కథ రాయాలనుటువంటి అభిలాషా?

కారా : పెద్ద కథ, చిన్న కథ అని కాదు. జీవితాన్న అబ్జర్వ్ చేయడమన్నది మా ఫాదర్ దగ్గర్నుంచి నేను కొంత నేర్చుకున్నాను. ఆ తరువాత కుటుంబరావుగారు మొదలైనటువంటి రచయితల రచనలు చదివిన తరువాత, వాటి ప్రభావంతో కూడా, జీవితాన్ని శ్రద్ధగా పరిశీలించి, ఏవి రాసినా రాయాలనేటటువంటి అభిప్రాయం మొదట్నుంచీ నాకు ఉంది. ఆ రోజుల్లోనైనా, ఇటీవల కాలంలోనైనా ఒకపేజీ రాయాలంటే పది పేజీలు నింపేటటువంటి స్వభావం నాది. ఆ కారణంగా నేను రాసింది ప్రచురించడానికి యోగ్యం అన్న గట్టి నమ్మకం కలిగేదాకా రాసిన వాటిని అలా ప్రక్కన పడేసానే తప్ప వేయలేదు. ఈ దశలోనే ఈ రకమైన దృష్టితోనే నేను చెప్పదల్చుకున్నదంతా చెప్పటానికోసమని చెప్పి, అవసరమైన కథ పెరిగింది.

కేతు : అయితే మాష్టారూ! మీ కథా రచనలో ... అంటే, ప్రధానంగా జీవిత సమస్యల చిత్రణలో, కొంత పరిణామం కనిపిస్తుంది. ఆ పరిణామాన్ని, మనం పరిశీలిస్తే, వ్యక్తి సమస్యల నుంచి కుటుంబ సమస్యల ఆచరణ నుంచి సామాజిక సమస్యల చిత్రణ వరకూ ఈ పరిణామం సాగింది. పరిణామంలోని వివిధ దశలను మీరు వివరిస్తే బాగుంటుందేమో.

కారా : 1943లో విశాఖపట్నంలో నేను రావడం, ఈ తొలి కథ పడటం ఒకటే. ఆ ఐదారు ఏళ్ళ జీవితానుభవాల్లోంచి పెద్ద కథ రాయగలిగేటటువంటి స్థితికి ... "భారతి" అన్నది ... "భారతి"లో కథ పడటం అన్నది, ఆ రోజుల్లో ఒక సర్టిఫికేట్ లాంటిది.

కేతు : ఆ కథ పేరేమిటి?

కారా : "పెంపకపు మమకారం". అదీ "భారతి"లో కథ అచ్చయ్యే నాటికి నాకు జీవితాన్ని అర్థం చేసుకోవడం... ఆనాడు నేను చదివినటువంటి రచయితల ద్వారా తెలుసుకున్నాను. మొదట... చెప్పేను కదా! మొదట్లో, నేను ఉండేది – పుట్టి పెరిగిన – చిన్న పల్లెటూరు. విశాఖపట్నం వచ్చింతరువాత నాకు కొంతమంది... నా పరిచయాలు పెరిగేయి. నే చదువుకునేందుకు పుస్తకాల సంఖ్య కూడా ఎక్కువగా లభించింది. మొదట్నుంచీ నేను కొంత అంతర్ముఖుణ్ణి. ఈ పరిణామాల వల్ల ప్రతీసారీ కూడా మీదికి ఎదగాలనేటటువంటి తపన నాకు మొదట్నుంచీ ఉంది. వీటన్నింటి ప్రభావం వల్లా, మొదట్లో కౌటుంబిక జీవితం మాత్రమే రాస్తుండే వాడ్ని. ఆ రోజుల్లో నేను ఏమనుకునే వాడ్నంటే – ఒక మనిషి లేదా ఒక కుటుంబం... వాళ్ళ తాలుకా దుః ఖానికి, కష్టాలికి కారణాలు వాళ్ళ స్వయంకృతాలే అనేటటువంటి అవగాహన ఉండేది. విశాఖపట్నం వచ్చింతరువాత, కుటుంబరావుగారు, గోపీచంద్‌గారు ఇట్లాంటి రచయితలను చదివింతరువాత, తరువాత వామపక్ష భావాలకు సంబంధించినటువంటి మిత్రులతో పరిచయాలు పెరిగిన తరువాత వ్యక్తి తాలూకా ప్రయత్నం వల్లే సమస్తం చక్కపడదు. ప్రతీదీ అతని చేతుల్లోనే లలేదు – అనేటటువంటి అవగాహన కలిగింది. భగవంతుడి తాలూకా కాన్సెప్ట్.... మన కష్టసుఖాలకి, సుఖ దుఃఖాలకి మన మంచి చెడ్డలకూ కారణం భగవంతుడు – అనేటటువంటి కాన్సెప్ట్ నాకు మొదట్నుంచీ లేదు. అందుచేతా, సామాజిక కారణాలనే నే వెదుక్కుంటూ వచ్చేను. ఈ అవగాహన పెరిగింతరువాత, నా కథల్లో ఆ పరిణామం .... '52 నుంచి ఆరంభమయ్యింది.

కేతు : ఈ పరిణామంలో ఒక గాఢమైనటువంటి సంవేదన ఫీలయ్యుంటారు. ఈ సంవేదనకు మీరు సాహిత్య కారాణాలు చెప్పేరు. మరి జీవితంలో ఏమైనా కారణాలు మనం అన్వేషించవచ్చా?

కారా : నా వ్యక్తిగతంగా ... మా నాన్నాగారితో కొంత పడేది కాదు నాకు. అంటే, ఘర్షణ, ఏనాడూ ఎరగం, ఆయన భావాలొకటి, నా భావాలొకటి. ఆయన ... ఒక మనిషి అభివృద్ధిలోకి రావాలీ అంటే అతని తాలూకా సంపాదన, పేరు, ప్రతిష్ఠ ఇట్లాంటి వాటి మీద.... అవి ప్రధానం అనుకునేవారు – ఆయన. అంచేత, నా చదువు అయిపోగానే, ఆయన నన్ను "మురపాక"లోనే ఉంచడానికోసం ప్రయత్నం చేసేరు. నేనంటే ఆయనకు చాలా గాఢమైన అభిమానం. ఒకసారి నేను ఇంట్లోంచి పారిపోయినపుడు మూడు రోజులు నిరాహారంగా అలా మంచం మీద పడుకున్నారు. అది ఆయన నన్ను మురపాకకు కట్టడానికి ప్రయత్నం చేసేరూ, నేను బయటకు రావటానికి ప్రయత్నం చేసేను. '53లో బయటకు వచ్చేసి, అక్కడ్నుంచీ దాదాపు ఆయన దగ్గర్నుంచి ఒక పైసా కూడా నేను అడిగి తీసుకోలేదు.... ఏనాడూను. నా కాళ్ళమీద నేను నిలబడే స్వయం శక్తితో బయటకు రావాలనేటటువంటి తాపత్రయం. దీనివల్ల చాలా కష్టాలు పడ్డాను. నా పరిస్థితిని మెరుగు పరుచుకోడానికోసం చేసేటటువంటి సర్వ ప్రయత్నాలలోంచి వచ్చేటటువంటి అవరోధాలున్నాయి. ఇట్లాంటి వాటి ప్రభావం కొంతుంది.

కేతు : ఈ అవరోధాలు – సామాజికమైనటువంటివి – అనే అవగాహన ఆ దశలో తెలిసింది. అయితే, మరొక చిన్న ప్రశ్న – మీ రచనా జీవితంలో మొత్తం ఈ 52 ఏళ్ళ రచనా జీవితం తీసుకుంటే ముప్పై ఏళ్ళు మీరు రాయకుండా ఉన్నారు. అంటే రెండు దశల్లో అనుకోండి. అదీ... ఇవి మౌన దశలు అని చెప్పవచ్చున్నమాట. 56 నుంచి 63 వరకూ మీరు ఏమీ రాయలేదు. 72 నుంచి 93 వరకు రాయలేదు. ఈ మౌనదశ రచయితల్లో అనివార్యంగా ఉంటుందా? ఈ విషయంలో .... మీ మౌనదశలకు ఏమైనా ప్రత్యేకమైన వ్యక్తిగత కారణాలుగానీ, సామాజిక కారణాలుగానీ, సాహిత్యకారణాలుగానీ ఉన్నాయా?

కారా : మొదటి మౌనానికి వ్యక్తిగత కారణాలు కనిపిస్తున్నాయి. '56 సరికి నేను రాసినటువంటి రచనలు మీద ఏ జీవితాన్నైతే చిత్రిస్తున్నానో ఆ విషయాలు మీద నాకు అసంతృప్తి కలిగింది. '53లో, రాచకొండ విశ్వనాథశాస్త్రిగారితో పరిచయమైన తరువాత, స్థానికమైనటువంటి నా దృష్టి విశాలం కావటం ఆరంభించింది. తరువాత సాహిత్యం గురించి, సాహిత్య ప్రయోజనం గురించి, సాహిత్యం తాలూకా లక్షణాల గురించి అవగాహన పెరిగింది.

అందుచేత వ్యక్తి, కౌటింబిక జీవితాలను మించి, సామాజిక జీవిత చిత్రణ, సాహిత్యంలో చేయటం అవసరం అని నాకు అనిపించింది. అంచేత ఆ స్థితికి నేను ఎదిగేదాకా రాయటం మానేశాను–ఒకటి. రెండోది – నేను చెప్పేను కదా! నాన్నగారి దగ్గర్నుంచి బయటకు వచ్చేసాను. '56 సరికి, నాకు – అప్పుడు – నలుగురు పిల్లలు – కుటుంబం, చేసేది సెకండరీ గ్రేడ్ టీచరు – ఉద్యోగం, విశాఖపట్నంలో ఉనికి, ఇవన్నీ ఆర్థికంగా నన్ను నొక్కి పెట్టేశాయి. వాట్ని తట్టుకోవటానికని చెప్పి, జీవితంలో ఇతర మార్గాలను నేను ప్రయత్నం చేసేను. అంటే ... ట్యూషన్లు చెప్పడం లాంటివి. ఇవీ ... ఈ కారణాలొకటి. రెండోది – నేను అంతవరకూ రాస్తున్నటువంటి సాహిత్య ధోరణి కన్నా విభిన్నమైనటువంటి సాహిత్య ధోరణి అందుకోవలసిన అవసరం ఉందని తెలియడం. ఈ రెండు కారణాల వల్ల మొదటి మౌనం?

కేతు : రెండో మౌనం?

కారా : రెండో మౌనాన్ని ఎనలైజ్ (Analyse) చేసుకోవటానికి (నవ్వుతూ) చాలాకాలంగా ప్రయత్నం చేస్తున్నాను. '72 తరువాత, '69 ఆ ప్రాంతంలోనో...., '70 ప్రాంతంలోనో, విరసం ఏర్పడింతరువాత

'72 దాకా నేను రాసేను. అప్పట్లో సాహిత్యం తాలూకా సామర్థ్యం గురించి నాకు చాలా గట్టి నమ్మకాలుండేవి. అవీ – విరసంలో చేరేకా, సందేహంలో పడ్డాయి. నేనేమి అనుకునేవాడ్నంటే – ఉత్తమ సాహిత్యం సమాజాన్ని మార్చగలదు అని అనుకునేవాడ్ని. ఉత్తమ సాహిత్యం సమాజాన్ని మార్చగలదు. అయితే ఏ ప్రక్రియలు మార్చగలవూ, ఏ ప్రక్రియలు మార్చలేవూ అనేటటువంటి అవగాహన, నాకు విరసంలో చేరింతరువాత, దాని ఏక్టివిటీస్‌లో పాల్గొన్న తరువాత, నాకు కల్గింది. కథ తాలూకా సామర్థ్యం గురించి దాని ... సామాజిక పరిణామాల మీద, దానికుండేటటువంటి శక్తి గురించి అనుమానాలొచ్చేయి. ఆ అనుమానాలకు కారణం ఏమిటంటే – విశాఖ విరసం యూనిట్ సాహిత్యాన్ని జనం మధ్యకు తీసుకువెళ్ళాలని జెప్పి, కొన్ని పేదలుండేటటువంటి పేటల్లోకి, పట్టుకెళ్ళి కథలు చదివేము. నేను మాండలికంలో రాస్తాను. రావిశాస్త్రిగారూ మాండలికంలోనే రాస్తారు. వాళ్ళ భాషే. కాని, ఆ జనానికి చదివి వినిపిస్తే, వాళ్ళ మీద, వాటి ప్రభావం కించిత్ కూడా లేదని, వాళ్ళ ముఖాలు చూస్తే నాకు అర్థమయ్యింది. చప్పట్లు కొట్టొచ్చు. బాగా ఉందనొచ్చు. కానీ, ఏ ఒకరో ఇద్దరో తప్పిస్తే, చదువుకున్న యువకుల్లో కూడా వాటి ప్రభావం తక్కువగానే నాకు కనిపించింది.

కేతు : అంటే ... దీనికీ ... ఒక చిన్న ... సందేహం మాస్టారూ! ఈ కథానిక లిఖిత ప్రక్రియ. వినిపించేటప్పుడు – కథనమూ, అందులో ఉండేటటువంటి సంభాషణలూ, అవీ మీరు రాసేటటువంటి కథలు... 63 నుంచి 72 దాకా రాసినటువంటి కథలన్నీ కూడా గ్రామీణ జీవితంకి, లేదా పట్న జీవితంలో వర్గాలకీ... బాగా నిరక్షరాస్య వర్గాలకీ, అక్షరాస్య వర్గాల జీవితాలకీ... సన్నిహితమైనటు వంటివి. అవి చదివినపుడు చదివేటటువంటి – కవిత్వం, చదివేటటువంటి వాడి ప్రదర్శనా సామర్థ్యం మీద ఆధారపడితే, బహుశా జనంలోకి వెళతాయేమో! దీని గురించి మీ అభిప్రాయం ఏమిటి?

కారా : అప్పుడు కూడా వెళ్ళవనే నా అభిప్రాయం. ఎంచేతంటే! శ్రామికజీవనం గడిపేవాళ్ళందరూ కూడ... వాళ్ళదీ.... వాళ్ళ దృష్టి – దివ్య దృష్టి. కథానిక లాంటి ప్రక్రియకి – వెనక్కి పోవటం, ముందుకు రావటం, ఎక్కడో ఆరంభించి ఇంకెక్కడికో తీసుకెళ్ళేందుకు, మధ్య మధ్యలో బోల్డు శాఖాచంక్రమణాలు. ఇవీ, వాళ్ళకి పట్టడం కష్టం అని నేను అనుకుంటాను. అప్పుడే పాటని, ప్రజలు బాగా రిసీవ్ చేసుకుంటారని అర్థమయ్యింది. విశాఖ విరసం యూనిట్ ప్రయత్నంలో ... అప్పుడే వంగపండు ప్రసాదు పుట్టేడు. మేవేమనుకున్నామంటే అంతకు ముందే "యజ్ఞం" రాసేను కాబట్టి, 'యజ్ఞం'ని బుర్రకథగా రాయించి, జనం మధ్యకు తీసుకెళ్ళొచ్చని ప్రయత్నం చేసేను. అప్పుడు కూడా, పూర్తిగా విజయవంతం కాలేదు. అందులో సంగీతానికి ప్రభావితమైనంతగా, వస్తువుకి, శ్రామిక జనం ప్రభావితమైనట్లుగా నాకు అనిపించలేదు.

కేతు : అందుకే, నాకు ఈ పాట మీద కూడా నాకొక రిజల్యూషన్ ఉంది. పాట ప్రధానంగా జనంలోకి వెళ్ళిపోయిందంటే – ప్రదర్శన ద్వారా వెళ్ళిపోయింది, దానికున్న గేయలక్షణం ద్వారా వెళ్ళిపోయింది, దాని వస్తువుని ఎంతమంది గ్రహిస్తున్నారు, ఆ వస్తువుతో ఎంతమంది మమైక్యం చెందుతున్నారు, ఆ వస్తువు నుండి ఎంతమంది చైతన్యం పొందుతున్నారు – అన్న విషయంలో నాకు కొన్ని సందేహాలు వున్నాయి. అందువల్ల వీట్లో ఈ భావాలకి సంబంధించినటువంటి దానికి ఈ చర్చ చేసేటప్పుడు, కథ లిఖితరూపమైనటువంటి కథ – జనంలోకి అంత సులభంగా వెళ్ళదు. ఇది అక్షరాస్య వర్గాల కోసమే. అక్షరాస్య వర్గాల్లో మార్పు తీసుకురావడం కోసమే – అని మీరు అనుకున్నారా! లేకుంటే ఋజువయ్యిందా?

కారా : అనుకున్నాను. ఋజువయ్యింది కూడాను. అయితే, అది గ్రహించడానికి కొంతకాలం

పట్టింది. అది ఒక కారణం. మీరు ఇందాక పాట గురించి అన్నారు కదా! పాట తాలూకా అంతర్గత సందేశం వెంటనే అందదు. పాట చెవికి ఇంకి, దాని మాధుర్యం నుంచి ముందు పాట మనిషిలోకి ఇంకుతుంది. ఇంకింతరువాత, ఆ పాట మననం చేసుకునే ప్రతీసారి కూడా దాని అంతర్గత సందేశం కొంచెం కొంచెంగా, బొట్టు బొట్టుగా, మనిషిలోకి ఇంకుతుందని – నాకు అర్థమయ్యింది. ఇదీ, గద్దరు పాటకైనా అంతే, లేదు వంగపండు పాటకైనా అంతే, లేదూ త్యాగరాజ కీర్తనలకైనా అంతే, ఏ వర్గం వారికి అభిరుచి కలిగినటువంటి, సాహిత్యం ఉన్న పాటైనా సరే అంతే – అని – ఇవి అన్నీను ఈ 72 తరువాత ఇటీవల కాలం దాకా నా అవగాహనలో పెరుగుతూ వచ్చింది. అందుచేత ఏమనుకున్నానంటే ఏ వర్గం అయితే లేదా ఏ స్థాయి పాఠకులైతే లిఖిత సాహిత్యాన్ని చదివి అర్థం చేసుకోగలరో దాని పట్ల ఆసక్తి కనబరుస్తారో, ఆ వర్గంకి, కథద్వారా, తరువాత నవల ద్వారా కూడా... మన... వాళ్ళతో మన భావాలు పంచుకోడానికి ఈ రెండు ప్రక్రియలను ఆశ్రయించవచ్చని నాకు అర్థమయ్యింది. అది అర్థమయ్యే నాటికి, నవల రాయాలనేటటువంటి కోరిక బలీయమయ్యింది. ఈ బలీయం కావడంతో, నవలలను కొన్నాళ్ళు అధ్యయనం చేస్తూ గడిపేను. ఆ తరువాత 'ఇనర్షియా' ప్రవేశించేసింది. దాన్ని వదలగొట్టు (నవ్వుతూ) కోవడం ఇప్పటి దాకా కూడా నాకు సాధ్యం కావటం లేదు.

కేతు :అయితే మాస్టారూ! మరొక్క – అతి ముఖ్యమైన – కథల జీవితాలకు సంబంధించినటువంటి ఒక ప్రశ్న. అంటే సమాజ చరిత్రకూ, సమాజ చలనానికీ మధ్య ఉండేటటువంటి సంబధాల్ని గుర్తించినటువంటి అతి కొద్దిమంది రచయితలలో మీరొకరు. ఉదాహరణకు చెప్పాలంటే ... 'కీర్తికాముడు' కథలో ఈ ... దిరుసు పలుకుబడి తగ్గడం రూపాయి పలుకుబడి హెచ్చడం ప్రస్తావించేరు. అది ప్రధాన పాత్ర చిత్రణలో కీలకమైనటువంటి అంశం. 1951లో వచ్చినటువంటి 'అప్రజ్ఞాతం',–ఆ కథలో రైతులు వ్యవసాయ కూలీలుగా మారటాన్ని మీరు చెబుతూ 'శ్రమించి చెమటోడ్చినవాడు ఎక్కడైనా సెంటు భూమి కొనగలిగేడా'– అని ఒక పాత్ర చేత అనిపిస్తారు. 'పలాయితుడు' కథలో ప్రధాన పాత్ర జూదగుండె ఆర్థిక విధానం ఉంటుందన్న మాట. మొట్ట మొదటి కథల్లో కూడా సామాజిక చలన సూత్రాలను, వాటికీ, వ్యక్తుల జీవితాలకూ ఒక ముడి ఉందని చెప్పేసేసి మీరు గుర్తించేరు కదా! మీ కథా రచనలో ఈ రకం సామాజిక చైతన్యం కథా రచయితలకు అసలు అవసరం ఏమిటి?

కారా : మీరు రెండు గుర్తించేనన్నారు. ఈ గుర్తించడం గుర్తించేటట్టు చేసినటువంటి వ్యక్తులు, శక్తులూ కూడా ఉన్నాయి. వ్యక్తుల్లో కుటుంబరావుగారు, గోపీచంద్‌గారు లాంటి వారైతే, శక్తుల్లో వామపక్ష భావాలు కలిగినటువంటి లేదా పార్టీలతో పనిచేసినటువంటి మిత్రులతో సహచర్యం – ఇవీ, నాకు ఆ రకమైనటువంటి... అవగాహన కలిగించేయి. ఇవాళ వస్తుండేటటువంటి సాహిత్యాన్ని మనం గమనిస్తే, ప్రతి దానికి కారణం వెతికేటప్పుడు నూటికి తొంభైమంది రచయితల తాలూకా అభిప్రాయం ఏమిటంటే – మానవుడికి అతీతమైన ఏదో శక్తి ఉంది, ఆ శక్తే ఈ నిర్ణయాలన్నిటి వెనుకాతల ఉంది అన్న ధోరణి అగుపడుతుంది. నాకూ... నేను స్వయంగా గమనించడం, తరువాత – ఈ గమనించిన దాన్ని, వీటి వెలుగులో అర్థం చేసుకోవడం – నా స్వభావం. నాకు ఏ భావాలైనా యథాతథంగా నేను తీసుకోను. అవీ – నా అనుభవంలోకి కూడాన్ను నిజం అనిపిస్తే తప్ప ఏ భావాలనూ నేను తీసుకోను. అలాగ తీసుకోవడం కోసం – అంటే నా అనుభవంలోకి రావాలంటే, నా అనుభవంలో ఉండేటటువంటి లేదా నా కంటికి కనిపించినటువంటి లోకాన్ని నేను గమనించవలసి ఉంటుంది, దాన్ని విశ్లేషించుకోవలసి ఉంటుంది, ఆ విధంగా జరుగుతుండడం వల్ల, ఇదీ

పరిణామం – నాలో వచ్చింది.

కేతు : మరీ! అయితే, ఈ రకం చిత్రణ, చారిత్రకమైనటువంటి శక్తుల చిత్రణ అనండి, సామాజిక శక్తుల పరదాల చిత్రణ అనండీ చిన్న కథలో సాధ్యమవుతుందంటారా – అందరు రచయితలకూ?

కారా : చిన్న కథలోనీ... కొద్ది కష్టమవుతుంది. నవలకే, ఈ... వాటినన్నటినీ దృష్టిలో పెట్టుకొని రాయగలిగేటటువంటి సౌలభ్యం నవలకే ఉంటుంది.

కేతు : మరీ... కథ. ఉద్దేశించినటువంటి పాఠకులు, చాలామంది దీనికి ప్రభావితమై చేయటేకపోవడానికి ఏ కారణం నిజమంటారు? పత్రికలా లేక చదివేటటువంటి పాఠకులా లేక కథకుల్లోనున్నటువంటి లిమిటేషనా? ఆ ఫారమ్‌కున్న లిమిటేషనా?

కారా : ఫారమ్‌కున్న లిమిటేషనని నేను అనుకోను. కథను సవ్యంగా, చెప్పగలిగినంత బలంగా, చెప్పవలసిన పద్ధతిలో చెప్తే కథ కూడా ఎక్కేస్తుంది. అయితే ఈ రెండింటికీ ఉన్న తేడా ఏమిటంటే – కథ ఒక అనుభవం చుట్టో, ఒక ఎరుక చుట్టో ఉంటుంది. ఒక సామాజిక పరిణామం నేపథ్యంలో ఒక వ్యక్తి, ఒక కుటుంబం లేదా ఒక సామాజిక వ్యవస్థ లలేదా మొత్తం మానవ సమాజం యొక్క సంక్షోభం – విటిని చిత్రించేది నవల. అందుచేత నవలకుండుటటువంటి శక్తి మొదలైనవి కంపేరిటివ్‌గా ఎక్కువే. కానీ, ఆధునిక యుగంలో కథ చదవడానికి ఉన్నంత తీరిక మంచి నవల చదవటానికి జనాలకి తక్కువ అవటం వల్ల, కథయే నాబోటి వాళ్ళు తీసుకుంటున్నారు.

కేతు : నాకు ఇక్కడొక చిన్న సందేహం మాస్టారూ! కథ ఏకబిగిన, చదవొచ్చు. నవల మనం తీరిక ఉన్నప్పుడు చదువుతూబోయినపుడు, అంతవరకు చదివినటువంటి భాగాలను కూడా మననం చేసుకుంటూ చదువుతాం. అందువల్ల మనన ప్రభావం ఎక్కువగా ఉండి, ఇప్పుడు వెంటనే చదినటువంటి... తరువాత్తరువాత ఎప్పుడో అవసరం అయినపుడు తప్ప మిగతా అప్పుడు మననం చేసుకోక చదవడం వల్ల కథను వేగంగా మరచిపోతున్నారా?

కారా : అదొక కారణమై అయ్యుంటుంది. అది నిజం కూడా అయ్యుండొచ్చు. కానీ బలమైన కథలు, అవి ఇచ్చేటటువంటి ఇంపేక్టు పాఠకుడ్ని ఆలోచింపజేసి అతనంతట అతను – ఏ అంతర్గత సందేశమైతే ఓ కథ ద్వారా పాఠకులకు రచయిత అందించడానికి ప్రయత్నం చేస్తున్నాడో – ఆ అంతర్గత సందేశాన్ని, తనంతట తాను, తన వస్తువుగా చేసుకొనేటటువంటి అవకాశం ఉంది.

కేతు : కథ ఏకబిగిన చదవచ్చు. మరి అంతర్గత సందేశం ఉన్నపుడు – విమర్శకుల మాట అటు ఉంచుదాం. రచయితగా మనకు స్పష్టమైనటువంటి ఒక అంతర్గత సందేశంపట్ల ఒక అవగాహన ఉంటుంది. 'యజ్ఞం' కథలో అంతర్గత సందేశం ఏమిటి? మీ అభిప్రాయంలో .... దాన్ని పోయింటు అంటున్నారూ, కథాంశం అంటున్నారూ.

కారా : సాధారణంగా నా కథల గురించి నేను చెప్పుకోటానికి ఇష్టపడను. కాబట్టి... ఇంకోలలా చెబ్తాను దానికి. నేనూ, 1964లో 'యజ్ఞం' వ్రాసేను. స్వతంత్రం వచ్చింతరువాత, నెహ్రూగారి హయాంలో, ఆయన చేస్తూండేటటువంటి, ప్రవేశపెట్టినటువంటి పంచవర్ష ప్రణాళికలు, ఆయన ఇస్తున్నటువంటి ఉపన్యాసాలు – ఇవీ! చిత్తశుద్ధితోనే, ఈ దేశం – తాలూకాతో కష్టపడేవాళ్ళ, అట్టడుగు వర్గాలు వాళ్ళ తాలూకా అభివృద్ధికి

పాటుపడుతోంది అనేటటువంటి అవగాహనతో, నేను ఉండేవాణ్ణి. ఒక దశ కొచ్చింతరువాత, నా కళ్ళముందు – మా ఊరు, నా చుట్టు పట్ల జరిగిన పరిణామాలు చూసింతరువాత నేను పొరబడ్డాను. ఈ ప్రణాళికలు ఇవన్నీ కూడ... ఇవీ – ఎవరైతే శ్రమపడుతున్నారో వాళ్ళకి కాకుండా – వాణిజ్యం వృత్తిగా చేసుకున్న వాళ్ళ తాలూకు పరిస్థితిని, పెద్ద ఎత్తున వ్యవసాయం చేస్తున్నటువంటి ఆ వర్గాన్ని, తరువాత రాజకీయాల్లో ప్రవేశించినటువంటి పవర్ – ఇంతో అంతో పవర్‌తో – ఇంతో అంతో సంబంధం ఉన్నటువంటి వర్గాలవార్ని – వాళ్ళకి ఈ పంచవర్ష ప్రణాళికలు ప్రయోజనకరంగా ఉన్నాయని, శ్రమపడే వాళ్ళ జీవితం మరింత అడుక్కుపోతోందని నాకు అర్థమైంది. ఇదంతా ఏమిటి? నా పరిశీలనలో నాక్కనిపించింది. నెహ్రూగారు కూడా అంటుండేవారు – ఈ పంచవర్ష ప్రణాళికలూ మొదలైన వాటివల్ల పేదలు మరింత పేదలు అవుతున్నారు, ధనవంతులు మరింత ధనవంతులవుతున్నారు అని అనేవారు. అది తెలిసింతరువాత, దాన్ని – పరిస్థితలను – మార్చే ప్రయత్నం చేయలేదూ, ఇవన్నీ ఆలోచించింతరువాత, ఆనాటి వరకు నాకుండేటటువంటి అభిప్రాయాలు మారాయి. ఆ ప్రేరణతోనే 'యజ్ఞం' వ్రాసేను. అంచేత, దాని అంతర్గత సందేశం (నవ్వుతూ) ఏమైయ్యుంటుందో మీరు దాన్నిబట్టి గ్రహించండి.

కేతు : ఇది ప్రేరణ... అంతర్గత సందేశం ఎందుకంటే! – అదే... అదే... ముఖ్యంగా ముగింపు మీద చాలా విమర్శలు వచ్చేయి కదా! రచయిత, సామాజిక వ్యవస్థ పట్ల అసంతృప్తిని సూచించేటటువంటి ముగింపు ఇప్పుడు జరుగున్నది సవ్యంగా లేదనేటటువంటి ముగింపూ మీరు చెబుతన్నటువంటి మొత్తం ప్రేరణ ఆ కథాంశంగా గ్రహించాలంటారా?

కారా : ఆ!

కేతు : అంతే కదా!

కారా : ఆ!... అంటే నేనేదైతే గమనించేనో దాన్ని యథాతథంగా అందులో పెట్టడానికి ప్రయత్నం చేసేను. ఎవరి కంటికి, అంటే ఎవరి మేధకి అందకుండా ఏదైతే జరుగుతుందో... దాన్ని అందులో చిత్రించినటువంటి జీవితం ద్వారా చిత్రించడానికి ప్రయత్నం చేసేను. ఎవరికంటికీ తెలియకుండా ఏం జరుగుతుందో – అన్నది, అందరి కంటికి కనిపించేటట్టు చేయడానికోసం అని చెప్పి, ఆ ముగింపు అలా చేసేను.

కేతు : మరి 'సంకల్పం' మాటేమిటి!? ఈ.... ప్రస్తావిస్తున్నానంటే, 'యజ్ఞం' మీద, 'సంకల్పం' మీద వివిధ కథలు అటుంచినా కూడా – ఎక్కువ విమర్శలు లేదా పరిశోధనలూ – ఇలాంటివి సాగాయి, వచ్చేయి. ఈ 'సంకల్పం'లో మీరు ఉద్దేశించినటువంటి కథాంశం లేదా అంతర్గత సందేశం ఉంది.

కారా : దీని గురించి కూడా ఒకటి రెండు విషయాలు చెబ్తాను. మొదటిదీ – అది AIR కోసం వ్రాసినటువంటి కథ – 'సంకల్పం'. అది విశాకపట్నం నుంచి ప్రసారమయ్యింది. ఒక వ్యాసంలో అతి చిన్న వస్తువుని – అంటే ప్రతి కథలోనిన్నూ – ఒక బీజ ప్రాయమైనటువంటి కథ ఉంటుంది. దాని తాలూకా శరీరం మొత్తం కథ – అనీ ఒక వ్యాసంలో రాస్తూ, శాస్త్రిగారి 'జరీ అంచు తెల్ల చీర'ని ఎన్ని రకాలుగా వేరు వేరు కథలుగా రాయొచ్చో, ఒక నాలుగు ఉదాహరణలు ఇచ్చి, ఆ కథకీ ఆ కథకి ఏ రకమైన సంబంధం లేదు – అనిపించేటట్టు కూడా రాయొచ్చు అని చెప్పి, ఈ 'సంకల్పం' కథలో ఉండేటటువంటి, అంటే అది మేసేజ్

అట్టాంటివి కాకుండి ఇన్సిడెంట్ తీసుకునే మాటైతే, బలమైన కోరిక, అతి చిన్న కోరిక, అయినా ఇతర కారణంగా ఆ కోరిక తీరకపోవడం వల్ల కలిగే వేదన – అది 'జరీఅంచు తెల్లచీర'లో మనం చూస్తాం. అదే ఇది... ఈ 'సంకల్పం' కథలో కూడా, ఒక సంకల్పం, ఆ సంకల్పం నెరవేరక పోవడం, దానిక్కారణాలు, అందులో వేదన, చిత్రించడానికోసం అని చెప్పి ...

కేతు : సామాజిక కారణాలకు, వ్యక్తి సంవవేదనల లేదా వ్యక్తి గాధలనువంటి బాధలకు, దుఃఖాలకు, వీటికి ఒక సంబంధం ఉందని మీరు ఆ కథలో నిరూపిస్తున్నట్లుగా, ఒక ప్రయత్నం చేసేరు అన్నమాట. అయితే మాస్టారూ! చివరగా ఒక ప్రశ్న అడుగుతాను. ఈ తక్కువ కథలు, ఎక్కువ కథలూ రాయడం అనేటటువంటిది రచయిత ప్రవృత్తికి సంబంధించినటువంటి అంశమా? లేదా ప్రతిభకో, అభ్యాసానికో, ఉత్పత్తికో సంబంధించినటువంటి అంశమా? ఈ ప్రశ్న మిమ్మల్ని అడగడానికి ఉద్దేశం ఏమిటంటే? మీరు తక్కువ కథలు వ్రాసి ఎక్కువ ప్రభావాన్ని మీ పాఠకుల మీద కలుగజేసేరు. తక్కువ కథలు ఎందుకు వ్రాయవలసి వచ్చింది?

కారా : నేను తక్కువ కథలూ.... నావి తక్కువ కథలు అచ్చులో మీరు చూసేరు. కానీ, 1943 నుంచి, ఈ క్షణం దాకా, నేను కథ గురించి ఆలోచించని రోజు ఉండదు. ఈ కథల్లో చాలా కథలు వ్రాసి –పూర్తిగా వ్రాసి ప్రక్కన పడేసి, చించేసి... ఇవి వున్నాయి. తరువాత – 'ఇది బ్రహ్మాండమైన కథ, దీన్ని వేసేయి' అని చెప్తే మిత్రుడు. ఆ... అతను అనుకున్న కథ కూడా... అదీ ఒక మనిషి ఇంకో మనిషిని చంపుతాడు. ఆ చంపితే – అది, కథ చెప్పడం – రేసీగా చెప్పడం వల్ల చాలా బ్రహ్మాండంగా ఉంది. ఇది పత్రిక్కి పంపించేయి – అంటే, నేనేమన్నానంటే – ఈ వ్యక్తి ఆ వ్యక్తిని చంపటం. అది వధా! హత్యా! ఈ రెండింటికీ మధ్య పెద్ద తేడా ఉంది. నేను హత్యని.... హత్య చేసేవాడ్ని – సమర్థించడానికి వల్లకాదు. వధ చేసేవాడ్ని సమర్థిస్తాను. రాముడు రావణున్ని చేసింది వధ. ఒక దుర్మార్గుణ్ణి తన కారణంగా, తనకే సంబంధించే కాకుండా ఇతర ప్రపంచానికి కూడా కంటకుడవడం వల్ల వాడ్ని తొలగించడం – అది వధ. అలాకాకుండా పర్సనల్ రీజన్స్ లేక అతడ్లో ఉండే కౌర్య దృష్ట్యానో ఒక వ్యక్తి ఇంకో వ్యక్తిని అదే పనిచేయడం – అది హత్య. అంచేత హత్యకీ, వధకీ తేడా ఉంది కాబట్టీ, ఈ కథను నేను పంపించనన్నాను. అలాంటి కథలు నా దగ్గర చాలా ఉండెను. ఈ '72 ఈ మధ్య కూడా అలా కథలు వ్రాస్తూనే ఉన్నాను. ఎక్కడంటే.... మనసులోని (నవ్వుతూ)

కేతు : (నవ్వుతూ) అలా... అయితే... ఈ కాళీపట్నం రామారావు కథలవి సంకలనం ఉంది కదా.... దాంట్లో ఒక సంజాయిషీని మీరు ఇచ్చేరు. మీరు నాకు చరిత్ర తెలీదని చాలా మోడెస్టీతో అలాగ అన్నారనుకోండి. దాంట్లో ఒక మాట అన్నారు – మన రాజకీయాల్లో లాగే... జనం వెంట లేనటువంటి, జనంతో సంబంధం లేనటువంటి నాయకులు మహా నాయకులయ్యేరూ, మన సాహిత్యంలో ఈలాగ ఎక్కువ భాగం ప్రైవేటు వ్యక్తుల జీవిత గాథలున్నాయి. ఈ గాథలు కాకుండా, మరే గాథలు ఈనాటి యువ రచయితలు రాయాలని మీ అభిప్రాయం?

కారా : దీనికి, కొంచెం ప్రక్కకు వెళ్ళి చెబ్తాను. '72లో నేను చేసేటటువంటి ప్రయత్నాలు – 70,71,72లో నేను చేసేటటువంటి ప్రయత్నాల్లో అంతవరకూ ఉన్నటువంటి కథని విప్లవ కథగా వ్రాయడం ఎలాగా!? కథలో కథానిక... కాంసెప్ట్లో విప్లవం తీసుకురావడం ఎలాగా అని చెప్పి ఆలోచిస్తున్న రోజుల్లో – అప్పుడు ఏర్పడ్డ భావం అది. అంటే..... మనం.... రాజుల పాలన, దేవుడు, రాజులు, వ్యక్తులు, ఒక ఉన్నత వర్గం – వీళ్ళ పాలనను వ్యతిరేకించి ప్రజాస్వామిక – నూతన ప్రజాస్వామిక – విప్లవం రావాలని కదా మనం

కోరుకున్నాం. చూసాకా... కథలో కూడా దాని రూపంలో కూడా అటువంటి మార్పు తీసుకొస్తే బాగుటుంది అని చెప్పి ఆలోచించేను. మీరూ, 'యజ్ఞం' తరువాత రాసినటువంటి కథల్లో – పెద్ద కథల్లో – ముఖ్యంగా 'చావు', 'ఆర్తి', 'భయం' – ఇల్లాంటి కథల్లో ఎక్కడా కూడానూ – ఒకటి రెండు పాత్రలు ప్రధానం కావు. అనేక పాత్రలు ఉంటాయి. 'చావు'లో అయితే దాదాపు ముప్ఫైయ్యో ఎన్నో పాత్రలు ఉంటాయి. 'ఆర్తి'లోనూ అల్లాగే చాలా ఎక్కువ ఉంటాయి. ఒక వ్యక్తి అట్లాంటి వాటి గురించి వ్రాయాలని, అందులో కేంద్రీకృతంగా ఒక్కడ్ని నాయకుడ్ని చేయడం తప్పని చెప్పే అవగాహనతో.... అలా... రాయగలిగితే....

కేతు : కేంద్రీకృత నాయకత్వం లేనటువంటి సాహిత్యం... కథా సాహిత్యం మనకి కావాలన్నమాట. అంతేనా. మీ అభిప్రాయం?

కారా : ఆ... ఇప్పుడూ... ఈ రకం ధోరణి అర్థం చేసుకొని రాస్తున్న వాళ్ళ కథల్లో... మాట వరసకి.... తుమ్మేటి రఘోత్తమరెడ్డి, అల్లం రాజయ్య – ఇట్లాంటి వాళ్ళు రాస్తున్న సాహిత్యం మీరు గమనించండీ! వాళ్ళు వ్యక్తులను కేంద్రీకరించరు. ఒక.... ఒక సామాజిక వ్యవస్థని చిత్రించడానికోసం అని చెప్పి పాత్రల తాలూకా వ్యక్తిగత ప్రాధాన్యతను తగ్గించి, రాస్తుంటాను.

కేతు : చాలా సంతోషం, మాస్టారూ! నమస్కారం.

*(ఆకాశవాణి, హైద్రాబాద్ కేంద్రం నుంచి 1995 మార్చి 19, 20 తేదీలలో ప్రసారితం.)*